సరిహద్దులో తనిఖీలు

■ మావోయిస్టు వారోత్సవాల సందర్భంగా పోలీసుల నిఘా

కోటపల్లి:రాపనపల్లి సమీపంలోని అంతర్రాష్ట్ర వంతెన వద్ద వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

కోటపల్లి, డిసెంబర్ 2: మావోయిస్టు వారోత్సవాల సందర్భంగా పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ నెల 2 నుంచి 8వ తేదీ వరకు పీఎల్‌జీ వారోత్సవాలు కొనసాగనుండగా పోలీసులు నిఘా పెట్టారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిసిన వెంటనే మావోయిస్టు వారోత్సవాలు ప్రారంభం కావడంతో తెలంగాణ–మహారాష్ట్ర పోలీసులు అలర్టయ్యారు. నేడు ఎన్నికల ఫలితాలు విడుదల కానుండడంతో పోలీసులు ఈ వారోత్సవాలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఇప్పటికే సరిహద్దులను ఆధీనంలోకి తీసుకున్న పోలీసులు అణువణువు జల్లెడ పడుతున్నారు. మండలంలోని రాపనపల్లి గ్రామం సమీపంలోని అంతర్రాష్ట్ర వంతెనతో పాటు రెండు రాష్ట్రాల వెంట ఉన్న ప్రాణహిత తీరం, జాతీయ రహదారి పై విస్తృతంగా పోలీసులు తనిఖీ చేస్తున్నారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే రాష్ట్రంలోకి అనుమతిస్తున్నారు. సరిహద్దుల్లో సీఆర్‌పీఎఫ్, స్పెషల్ పార్టీ, సివిల్ పోలీసుల ఆధ్వర్యంలో కూంబింగ్ నిర్వహించడంతో పాటు డ్రోన్ కెమెరాతో సరిహద్దులపై మూడో కన్ను పెట్టి పహరా కాస్తున్నారు. వారోత్సవాల సందర్భంగా సరిహద్దు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సరిహద్దుల్లో, గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా సంచరించినా, కొత్త వ్యక్తులు కనిపించినా పోలీస్‌లకు సమాచారం ఇవ్వాలని చెన్నూర్ రూరల్ సీఐ విద్యాసాగర్, కోటపల్లి ఎస్ఐ సురేశ్ సూచిస్తున్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్

సైన్స్ డ్రామా పోటీలకు హాజరు

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, డిసెంబర్ 2: జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల విద్యార్థులు దక్షిణ భారత సైన్స్ డ్రామా పోటీల్లో పాల్గొన్నట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. బెంగళూరులోని విశ్వేశ్వరయ్య టెక్నాలజికల్ మ్యూజియం వద్ద నవంబర్ 23 నుంచి 25వరకు నిర్వహించిన సైన్స్ డ్రామా ఫెస్టివల్‌లో పాల్గొన్న మోడల్ స్కూల్ ఆసిఫాబాద్ విద్యార్థులు 'మిల్లెట్స్– ది సూపర్ ఫుడ్ ' అంశంపై డ్రామా ప్రదర్శించారు. ఈ పోటీలకు సైన్స్ ఉపాధ్యాయుడు జాడి ప్రవీణ్ మార్గదర్శకం చేయగా, స్క్రిప్ట్ వర్క్ ను పాఠశాల టీజీటీ కమ్రే శోభ చేశారు. ఈ డ్రామా భారతీయ మిల్లెట్స్ క్వీన్ బ్రాండ్ అంబాసిడర్ లహరి బాయి నిజ జీవిత కథ ఆధారంగా రూపొందించారు. ఆమె తన ఇంట్లో 150 మిల్లెట్ (చిరు ధాన్యాలు) రకాలను సంరక్షించి భారతదేశపు మిల్లెట్ క్వీన్ గా పేరు తెచ్చుకుంది. ఆమె కథపై డ్రామా ప్రదర్శించగా అందరినీ విశేషంగా ఆకట్టుకుంది. ఈ నాటకంలో విద్యార్థులు కొండు అక్షిత, ముంజం అక్షిత, మనస్విని, బండ నేత్ర, సామల వేదాక్షర, గుండేటి భవన మనేం అక్షిత, జంజిరాల పల్లవి, పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాల నుండి రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటి దక్షిణ భారత స్థాయిలో ప్రాతినిధ్యం వహించడం పట్ల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ కమిటీ విద్యార్థులను, డ్రామా డైరెక్టర్ ప్రవీణ్, స్క్రిప్ట్ రైటర్ శోభను అభినందించారు.

అమ్మవార్లకు బోనాలను సమర్పిస్తున్న భక్తులు

ఘనంగా మదనపోచమ్మ జాతర

కోటపల్లి, డిసెంబర్ 2: కోటపల్లి మండలం జనగామ గ్రామంలో మదనపోచమ్మ జాతర వైభవంగా కొనసాగుతున్నది. కోటపల్లి మండలంతో పాటు చుట్టు పక్కల మండలాలు, మహారాష్ట్ర నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవార్లకు భక్తులు బోనాలను సమర్పించి, పట్నాలు వేసి పూజలు చేశారు. జాతరకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరు కాగా పండుగ వాతావరణం ఏర్పడింది

క్రికెట్ పోటీలకు ఎంపిక

ఎంపికైన విద్యార్థితో ప్రిన్సిపాల్ మహేశ్వర్‌రావు

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, డిసెంబర్ 2: ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని వాసవి పాఠశాలలో పదో తరగతి విద్యార్థి సుబ్బ సూర్య తేజ ఎస్జీఎఫ్ఐ అండర్ 17 క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మహేశ్వర్ రావు తెలిపారు. పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్జీఎఫ్ఐ) ఆధ్వర్యంలో డిసెంబర్ 2వ తేదీన ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని క్రీడా మైదానంలో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్ 17 క్రికెట్ పోటీల్లో జిల్లా కేంద్రంలోని శ్రీ వాసవి విద్యామందిర్ పాఠశాల కు చెందిన సుబ్బ సూర్య తేజ బోలింగ్ లో ఉత్తమ ప్రదర్శనతో రాష్ట్ర స్థాయి ఎస్జీఎఫ్ఐ అండర్ 17 క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా సుబ్బ సూర్య తేజను ప్రిన్సిపాల్ మహేశ్వర్ రావు, వ్యాయామ ఉపాధ్యాయుడు సాయి,యాజ మాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు.

విరబూసిన బ్రహ్మ కమలం

విరబూసిన బ్రహ్మ కమలం

దండేపల్లి, డిసెంబర్2: అరుదైన బ్రహ్మ కమలాలు దండేపల్లి మండల కేంద్రంలో కనువిందు చేశాయి. దండేపల్లి పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న లచ్చు పటేల్ మూడు నెలల క్రితం బ్రహ్మ కమలం మొక్కను నాటాడు. అయితే మూడు మొగ్గలు వికసించాయి. ఈ నేపథ్యంలో లచ్చుపటేల్ కుటుంబ సభ్యులు బ్రహ్మ కమలం మొక్కకు పూజలు నిర్వహించారు. శివుడికి ప్రీతిపాత్రమైన పుష్పంగా పురాణాలు చెబుతున్నాయి. రాత్రి వేళల్లో ఈ పువ్వు పూస్తుందని చెబుతున్నారు.

ఓట్ల లెక్కింపు పకడ్బందీగా నిర్వహించాలి

■ వీసీలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్

వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్

ఆసిఫాబాద్,డిసెంబర్ 2: అసెంబ్లీ నియోజకవర్గ సాధారణ ఎన్నికల్లో భాగంగా ఆదివారం జరుగనున్న కౌంటింగ్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి అదనపు ఎన్నికల అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో కౌంటింగ్ కార్యక్రమం నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియను ఎలాంటి పొరపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు. కౌంటింగ్ కేంద్రంలో టేబుళ్లు, కౌంటర్లు, మీడియా, రాజకీయ పార్టీల ద్వారా నియమించబడిన ఏజెంట్లు ఇతరత్రా అన్ని ఏర్పాట్లను నిబంధనలకు లోబడి చేయాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవనంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవరావు వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 001–సిర్పూర్, 005–ఆసిఫాబాద్ నియోజకవర్గాలకు కలిపి జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో కౌంటింగ్ కేంద్రం ఏర్పాటు చేసి పూర్తి బందోబస్తు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి నియోజకవర్గానికి 19 చొప్పున కౌంటింగ్ బృందాలు, 14 కౌంటింగ్ టేబుళ్లు, 3 పోస్టల్ బ్యాలెట్ టేబుళ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ల ఓట్ల లెక్కింపు, 8.30 గంటలకు కంట్రోల్ యూనిట్ల ఓట్ల లెక్కింపు ప్రారంభించడం జరుగుతుందని, ర్యాండం ప్రకారం వీవీ ప్యాట్లలోని స్లిప్పుల లెక్కింపు జరుగుతుందని తెలిపారు. ఎన్నికల సాధారణ పరిశీలకుల సమక్షంలో కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియ నిర్వహణ కొరకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

ఆసిఫాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థిని కలిసిన నాయకులు

ఆసిఫాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవలక్ష్మితో నాయకులు

నార్నూర్, డిసెంబర్ 2 : నార్నూర్ మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు శనివారం ఆసిఫాబాద్‌లో నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిశారు. కలిసిన వారిలో సహకార సంఘం ఇన్‌చార్జి చైర్మన్ ఆడే సురేశ్, మాజీ జడ్పీటీసీ రూపావతి జ్ఞానోబాపుష్కర్, ఐటీ డీఏ డైరెక్టర్ మడావి మాన్కు, కోఆప్షన్ సభ్యుడు షేక్ దస్తగిరి, నాయకులు చంద్రశేఖర్, మసూద్, తదితరులు ఉన్నారు.

ఉత్సాహంగా జోనల్ స్థాయి క్రికెట్ ఎంపిక పోటీలు

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి

ఆదిలాబాద్ రూరల్, డిసెంబర్ 2 : ఆదిలాబాద్ లోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో శనివారం అండర్ –17 బాలుర జోనల్ స్థాయి క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఉమ్మడి జిల్లా నుంచి పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు. జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థరసారథి ముఖ్యఅతిథిగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో కాంతారావు, స్వామి, జయేంద్ర, విఠల్ రెడ్డి పాల్గొన్నారు.